'మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం'

తెలంగాణచౌక్, జూన్ 8: దేశ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్న మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లు తొలగించాలని పన్నాగాలు పన్నిన బీజేపీకి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. గతంలో సాధించిన సీట్లు కూడా బీజేపీ గెలువలేకపోయిందన్నారు. బీజేపీ పాలనలో కార్మికులు, ప్రజా సంఘాలకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. అణచివేత ధోరణితో ప్రధాని మోదీ పాలన కొనసాగించారని ఆరోపించారు. ఇటీవల ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకున్నా మిత్రపక్షాలతో కలిసి అధికారం చేపట్టాలని చూస్తున్నారన్నారు. సొంత మెజార్టీ లేని బీజేపీ ఎక్కువ రోజులు అధికారంలో ఉండే అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, ఎడ్ల రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అంగారిక'లో వసతులు కల్పించాలి

మాట్లాడుతున్న రఘుశంకర్ రెడ్డి తదితరులు

తిమ్మాపూర్, జూన్ 8: మండలంలోని రామకృష్ణకాలనీలో గల అంగారిక టౌన్ షిప్‌లో మౌలిక వసతులను ప్రభుత్వం వెంటనే సమకూర్చాలని ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘు శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టౌన్‌షిప్‌లో ప్లాట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అంగారికలో 819 ప్లాట్లు వేలం ద్వారా విక్రయించిందని, చాలామంది ఇల్లు కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వం ఇప్పటివరకు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నీటి వసతి కల్పించలేదన్నారు. ఫలితంగా చిన్న చిన్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తమ చిరకాల వాంఛ అయిన ఇంటి నిర్మాణం చేపట్టలేక నైరాశ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టౌన్ షిప్‌లో వసతులు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు కిషన్ రెడ్డి, చందా సత్యనారాయణ, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, డాక్టర్ లక్ష్మణమూర్తి, తుమ్మల రమేశ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అధిక సంఖ్యలో ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

'బడి బాట'కు స్పందన

- గ్రామాల్లో ఉపాధ్యాయుల అవగాహన ర్యాలీలు
- ప్రవేశం కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

చిగురుమామిడి: ఇందుర్తిలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నది. ప్రవేశాల కోసం నమోదు చేసుకునే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. శనివారం తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ పాఠశాలల్లోని సౌకర్యాలు, సాధిస్తున్న ఫలితాలు వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

చిగురుమామిడి, జూన్ 8: ఇందుర్తి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు, విద్యబోధన గురించి వివరించారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులు పాఠశాలలో ప్రవేశానికి పేరు నమోదు చేసుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ జయప్రద, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మల్లమ్మ, ఇందుర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి, రమణాచారి, భాషబత్తిని ఓదెలు కుమార్, మంజుల, పవన్ కుమార్, మాధవి, రఘుపతిరెడ్డి, సవిత, సత్తయ్య, రమాదేవి, నిహారిక, ఇంద్రావతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉష, భవానీ జలపతి రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిరా, విజయ మూరమ్మ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: నుస్తులాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సమావేశంలో మాట్లాడుతున్న సర్వశిక్షా అభియాన్ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి

హాజరైన మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు

ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి

మానకొండూర్ రూరల్, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో నాణ్యమైన విద్య అందుతున్నదని, దీనిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సర్వశిక్షా అభియాన్ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మానకొండూర్ మండలం అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు నీలం లావణ్య, స్వయం సహాయక సంఘాల సహాధ్యక్షులు బత్తుల భాగ్యలక్ష్మి, పద్మ, స్వరూప, వర్షిణి, సరిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి మాజీ ఎంపీ సంతాపం

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 8 : మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా, పలు రంగాల్లో వ్యాపారవేత్తగా రామోజీరావు అందించిన సేవలను ఎప్పటికీ మరిచిపోలేనివని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడు వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనాడు దినపత్రికను స్థాపించి ఉదయాన్నే ప్రజలకు వార్తలను చేరవేయడంతో ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పథకానికి నిధులు విడుదల చేయాలి

కలెక్టరేట్, జూన్ 8: పేద ప్రజల జీవనానికి భరోసా ఇచ్చే ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మెర మోహన్ డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు అదనంగా మరిన్ని కలిపి, కార్మికులకు ఏడాది పొడవునా పని కల్పించాలని కోరారు. శనివారం నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పేదల పాలిట కల్పతరువులా మారిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. పథకంలోని సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, ప్రతి కుటుంబానికీ పని కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా రూ.600 దినసరి కూలి చెల్లించాలని కోరారు. పథకాన్ని రద్దు చేసే ఆలోచనతోనే మోదీ ప్రభుత్వం నిధులు తగ్గిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని, ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు ప్రతి కార్మికుడు సన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉపాధి కార్మికుల సమ్మేళనానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులను తరలించేలా కార్యాచరణ రూపొందించారు. సమావేశంలో నాయకులు కాసర్ల సమ్మయ్య, భూక్యా రవినాయక్, రాములు, కోటేశ్, వైద్యుల రాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పరామర్శ

వీణవంక, జూన్ 8: మండల కేంద్రానికి చెందిన గెల్లు ఓదమ్మ ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొంది రాగా, శనివారం ఉదయం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఓదమ్మ కుమారుడు గెల్లు కొమురయ్య యాదవ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ వోరెం భానుచందర్, నాయకులు వోరెం మధు, నీల శ్రీకాంత్, గెల్లు కుమార్, రాజు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామడుగు(చొప్పదండి), జూన్ 8: రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి సత్తమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, శనివారం ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు వీర్ల సంజీవరావు, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 8: నగరంలో ట్రాన్స్ ఫార్మర్ బిగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం సాయంత్రం 4.30నుంచి 5గంటల వరకు ఆర్వీన్ స్కూల్ ఏరియా, వాసుదేవ కాలనీ, ఎర్రగుట్ట కాలనీ, భగత్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

గన్నేరువరం, జూన్ 8: మండలంలోని ఖానీంపేట గ్రామానికి చెందిన జక్కనపెల్లి రాయమల్లు (42) కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కోసం సౌదీ వెళ్లిన రాయమల్లు ఇటీవల తిరిగి వచ్చాడు. ఆయన సోదరి రామంచ సత్తవ్వ అదే గ్రామంలో నూతన గృహం నిర్మించుకుంటుండగా, స్వయంగా ప్లంబర్ అయిన రాయమల్లు ఫ్లోరింగ్ వర్క్ చేస్తున్నాడు. శనివారం ఫ్లోరింగ్ మెషిన్ మోటర్ ఆన్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు హాస్పిటల్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మృతి చెందాడు. రాయమల్లు భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

కమాన్‌చౌరస్తా, జూన్ 8 : గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కాబోతున్న ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు కరీంనగర్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ నాగార్జున, జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. సమయపాలన గురించి తెలియజేశారు. అలాగే విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో సెయింట్ జార్జ్ విద్యార్థుల ప్రతిభ



నీట్‌లో రాణించిన సెయింట్ జార్జ్ పూర్వ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కొత్తపల్లి, జూన్ 8 : నగరంలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ)లో చదివిన పలువురు విద్యార్థులు నీట్ 2024 ఫలితాల్లో అద్భుత ప్రతిభ చూపారు. వీరిలో జయంత్ 479 మార్కులు, డీ అపూర్వ 544, ఏ రుచిత 589, జీ చంద్ర వేణు 483 మార్కులు సాధించగా, శనివారం పాఠశాలలో వారికి అభినందన సభ నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డా. పీ ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సమష్టికృషితో ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఏ భార్గవ్, వీ నిరంజన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

సైదాపూర్, జూన్ 8: వెన్నంపల్లి గ్రామానికి చెందిన కస్తూరి బ్రహ్మచారి (75) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మచారి వడ్రంగి పనిచేస్తుండేవాడు. ఆయన కుమారుడు సుమారు ఏడు సంవత్సరాల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి బ్రహ్మచారి తీవ్ర మనోవేదన చెందుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ముందుగా హుజూరాబాద్ దవాఖానకు, అక్కడి నుంచి హనుమకొండ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం బ్రహ్మచారి మృతిచెందాడు. అతడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

సత్తాచాటిన జిల్లా క్రీడాకారులను అభినందిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

కొత్తపల్లి, జూన్ 8 : హనుమకొండ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించారు. పురుషుల విభాగంలో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచిన వారిలో ఈ విష్ణువర్ధన్ 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో గోల్డ్ మెడల్, హై జంప్, త్రిపుల్ జంప్‌లో వివేకానందు సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే 800 మీటర్ల విభాగంలో కే రవి సిల్వర్, 1500 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించగా, జావెలిన్ త్రోలో కే స్వామి సిల్వర్ మెడల్, 3000 మీటర్ల స్టీఫల్ చేస్ విభాగంలో సంతోష్ బ్రాంజ్ మెడల్‌తో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర చాంపియన్స్‌గా నిలిచారు. మహిళల విభాగంలో లాంగ్ జంప్‌లో సీహెచ్ పూజ గోల్డ్ మెడల్, 400 మీటర్ల హార్డిల్స్, 800 మీటర్ల పరుగు పందెంలో డీ భార్గవి సిల్వర్ మెడల్స్ సాధించి సత్తాచాటారు. 10 సంవత్సరాల బాల బాలికల విభాగంలో లాంగ్‌జంప్‌లో నరేన్ సిల్వర్ మెడల్, ఫైజాన్ 150 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు. 14 సంవత్సరాల బాలబాలికల విభాగంలో జి. నక్షత్ర 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 18 సంవత్సరాల బాలుర విభాగంలో డిస్కస్ త్రోలో విక్రమ్ గోల్డ్ మెడల్, జావలిన్ త్రోలో సిల్వర్ మెడల్, కంబైన్ ఈవెంట్‌లో సాత్విక్ సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు తిరుపతి, వరుణ్ కృష్ణన్‌ను అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు నందెల్లి మహిపాల్, కడారి రవి, హరికిషన్, రంగారెడ్డి, సర్దార్ భూషణ్ సింగ్, జగ్బీర్ సింగ్, రాజగోపాల్‌చారి, ఉన్క లక్ష్మణ్, చంద్రశేఖర్, రమేశ్ తదితరులు అభినందించారు.



జగ్గయ్యపల్లిలో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జూన్ 8: జమ్మికుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. జమ్మికుంట పీఏసీఎస్ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని, మరింత ఉన్నతంగా సొసైటీ ఎదగాలని ఆకాంక్షించారు. జమ్మికుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో 2018లోనే డీజిల్ బంక్‌ను ఏర్పాటు చేయగా, ఇటీవల పెట్రోల్ బంక్ మంజూరైంది. మంజూరైన పెట్రోల్ బంక్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ బంక్ ఏర్పాటు వల్ల సమీపంలోని రైతులు, వినియోగదారులకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. బంకు ఏర్పాటు వల్ల సొసైటీ ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని, రైతులకు లాభిస్తుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కార్యనిర్వహణాధికారి రవి, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, ఎంపీపీ దొడ్డి మమతాప్రసాద్, తదితరులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ సొసైటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, తదితరులున్నారు.

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌లు

మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా జడ్జి డి వెంకటేశ్

కోర్టుచౌరస్తా, జూన్ 8: లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందవచ్చని కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి డీ వెంకటేశ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని మీడియేషన్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనవసరపు తగాదాలతో వేసుకున్న చిన్న చిన్న కేసులు, కుటుంబ తగాదాల కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకుంటే డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందని, ఇరు పార్టీల మధ్య సంతోషకర వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గతంలో గ్రామాల్లో చిన్న చిన్న తగాదాలు, కుటుంబ గొడవలను అక్కడి పెద్ద మనుషులు పరిష్కరించే వారిని, ఆస్థానంలో ఇప్పుడు లోక్‌అదాలత్‌లు వచ్చాయని తెలిపారు. ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో న్యాయ సేవాధికార సంస్థలు ఉంటాయని, వాటిని ఆశ్రయించి ఉచితంగా న్యాయ సహాయం సలహాలు పొందవచ్చన్నారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్ కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేశ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌ల గురించి వివరించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్ లోక్ అదాలత్‌లకు బార్ అసోసియేషన్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం న్యాయమూర్తులు లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి నీరజ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, మెజిస్ట్రేట్లు, ఏసీపీ విజయ్ కుమార్, అడిషనల్ పీపీ గౌరు రాజిరెడ్డి, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1605 కేసులు పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో రాజీ చేయదగిన 1605 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. వీటిలో క్రిమినల్ కేసులు 1588, సివిల్ మూడు, మోటారు ప్రమాద పరిహారం కేసులు 14 పరిష్కరించినట్లు వెల్లడించారు. ప్రీ లిటిగేషన్ కేసులు 53,033 పరిష్కరించగా, అందులోని ప్రతివాదులకు జరిమానా విధించినట్లు తెలిపారు.

కూలీ అనుమానాస్పద మృతి

సైదాపూర్, జూన్ 8: గుజ్జులపల్లిలో కూలిపనికి వచ్చిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన దినసరి కూలీ మెట్ట మొగిలి(45) మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయబావి వద్ద రింగులు పోయిస్తుండగా, శనివారం పనులకు వచ్చాడు. అదే బావి వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. కాగా, వేరే గ్రామానికి పనులకు వచ్చిన వ్యక్తి మృతిచెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆరెక్షత్రీయ సంఘం నాయకులు

గన్నేరువరం, జూన్ 8: మండలంలోని చీమలకుంటపల్లిలో ఆరెక్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మరాఠా యోధుడు శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం పెద్దలు విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. శివాజీ మహారాజ్ విగ్రహాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మర్రనపేట నరేశ్, శ్రీకాంత్, సంతోష్, శ్రీనివాస్, రవీందర్, శ్రీను, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల ఆరెక్షత్రీయ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోరుగా చేపల విక్రయాలు

కరీంనగర్ రూరల్, జూన్ 8: మృగశిర కార్తె సందర్భంగా కరీంనగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. శనివారం ఆయా గ్రామాల్లోని చెరువుల్లో మత్స్యకారులు చేపలు పట్టగా, కొనుగోలు కోసం అక్కడికి చేరుకున్న నగరవాసులతో సందడి ఏర్పడింది. రవ్వు, బొచ్చ రకం చేపలు కిలోకు రూ.150 ధర పలుకగా, బొమ్మెలు రూ.400 నుంచి రూ.450 చొప్పున విక్రయాలు సాగాయి.

ఆధునిక పద్ధతుల్లో బ్రెయిన్ ట్యూమర్‌కు మెరుగైన చికిత్స

- మెడికవర్ న్యూరోసర్జన్ డాక్టర్ బోగ వెంకటేశ్

మాట్లాడుతున్న మెడికవర్ న్యూరోసర్జన్ డాక్టర్ బోగ వెంకటేశ్

విద్యానగర్, జూన్ 8: బ్రెయిన్ ట్యూమర్ అనగానే భయపడాల్సిన అవసరం లేదని, ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా మెరుగైన చికిత్స అందుబాటులో ఉందని మెడికవర్ న్యూరోసర్జన్ డాక్టర్ బోగ వెంకటేశ్ పేర్కొన్నారు. వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్‌డే సందర్భంగా శనివారం మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ, మెదడులో ఏర్పడే ప్రతి గడ్డ బ్రెయిన్ ట్యూమర్‌గానే పరిగణిస్తారని చెప్పారు. తీవ్రమైన తలనొప్పి, వాంతులు, మూర్ఛ రావడం, కంటి సమస్యలు, మాటలు సరిగా మాట్లాడలేకపోవడం, ప్రవర్తనలో మార్పు, మతిమరుపు లాంటివి ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలున్న వారు డాక్టర్‌ను సంప్రదించినట్లయితే బ్రెయిన్ ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ద్వారా వ్యాధిని గుర్తించడం సులభం అవుతుందన్నారు. వీటిలో కొన్ని క్యాన్సర్‌తో సంబంధం ఉన్నవి, మరికొన్ని సంబంధం లేనివి ఉంటాయన్నారు. బయాప్సి ద్వారా మాత్రమే క్యాన్సర్‌ను కనుగొనడం వీలవుతుందన్నారు. 20 ఏళ్ల క్రితం ట్యూమర్ సర్జరీకి ఇప్పటికీ చాలా తేడా ఉందన్నారు. అధునాతన వైద్య పద్ధతుల ద్వారా 90 శాతం సర్జరీలు సక్సెస్‌ఫుల్‌గా చేయగలుగుతున్నామని చెప్పారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్